సాక్షి
కుమురం భీం

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

తిర్యాణి మండలం గుండారంలో ట్రాక్టర్ బోల్తా పడి ఎనిమిది మందికి తీవ్ర, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 8లో▸



సమస్యల్లో 'కొత్తగూడ'

కెరమెరి మండలం కొత్తగూడ గ్రామాన్ని సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ఏళ్లకు పైగా కనీస సౌకర్యాలకు నోచుకోక ఇక్కడి ప్రజలు సమస్యల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /19.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల ఫలితాల కోసం జిల్లా కేంద్రానికి నేతలు

సిర్పూర్(టి): జిల్లాలోని సిర్పూర్(టి), ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. సిర్పూర్(టి) అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కోసం ఆదివారం సిర్పూర్(టి) మండలంలోని ఆయా గ్రామాల్లోగల వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫలితాలు తమకంటే తమకే అనుకూలంగా ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ అభిమాన నాయకుడి గెలుపు ఖాయమని ఎవరికి వారే ధీమాగా ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశ గడువు పెంపు

కెరమెరి: ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశ గడువు ఈ నెల 11వ తేదీ వరకు పెంచినట్లు కోర్సు కోఆర్డినేటర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బడిమానేసిన పేద విద్యార్థులకు ఇదో చక్కని అవకాశమని, టెన్త్, ఇంటర్ చదివి మధ్యలో ఆపేసినవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9494311845 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవీ పాఠశాల విద్యార్థులు అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మహేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1నుంచి 2వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో జరిగిన జోనల్‌స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

కాగజ్‌నగర్ డివిజన్‌లో త్వరలో బర్డ్‌వాక్



మాట్లాడుతున్న సీఎఫ్ శాంతారామ్

బెజ్జూర్: కాగజ్‌నగర్ డివిజన్‌లో బర్డ్‌వాక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు అటవీశాఖ కాళేశ్వరం జోన్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శాంతారామ్ తెలిపారు. శనివారం బెజ్జూర్ రేంజ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని బెజ్జూర్, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, సిర్పూర్ అటవీప్రాంతంలో త్వరలో బర్డ్ వాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, అపారమైన వన సంపద, పచ్చటి సెలయేళ్ల గురించి తెలియజేయడానికి బర్డ్‌వాక్ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. అడవుల సంరక్షణతో పాటు స్మగ్లింగ్ నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకుముందు బర్డ్‌వాక్‌పై కాగజ్‌నగర్ డివిజన్‌లోని అటవీశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎఫ్‌డీవో వేణు, రేంజ్ అధికారులు వేణుగోపాల్, దయాకర్, చంద్రమౌళి, శ్రావణ్‌కుమార్, ప్రభాకర్, రమాదేవి, శ్రీనివాస్, మల్లికార్జున్, వెంకటేశ్, అనిత తదితరులున్నారు.

సైన్స్ డ్రామాలో 'మోడల్' విద్యార్థినులు



పోటీలో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థినులు దక్షిణ భారత సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శనివారం తెలిపారు. పాఠశాల ఆవరణలో డ్రామా డైరెక్టర్ ప్రవీణ్‌తో కలిసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 23నుంచి 25వ తేదీ వరకు బెంగళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ మ్యూజియంలో నిర్వహించిన సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో 'మిల్లెట్స్ ది సూపర్ ఫుడ్' అంశంపై డ్రామా ప్రదర్శించినట్లు తెలిపారు. డ్రామా అందరినీ ఆకట్టుకుందని, ఇందులో విద్యార్థినులు అక్షి, మనస్విని, నేత్ర, వేదాక్షర, భవన, మనెం అక్షిత, పల్లవి పాల్గొన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి దక్షిణ భారత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంజేశారు. స్క్రిప్ట్ రైటర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

నేడే ఓటరు తీర్పు

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8గంటలకు ప్రక్రియ షురూ
- ఫస్ట్ 'పోస్టల్', సర్వీస్ ఓట్ల లెక్కింపు
- 8.30గంటలకు ఈవీఎంలలోనివి..
- నియోజకవర్గానికి 14టేబుళ్ల ఏర్పాటు
- పోస్టల్ బ్యాలెట్‌కు అదనంగా మూడు..
- తొలుత సిర్పూర్ ఫలితం వెల్లడి



సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

సాక్షి, ఆసిఫాబాద్: కొన్ని గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆదివారం మధ్యాహ్నం కల్లా విజేత ఎవరో తేలనుంది. శాసనసభ ఎన్నికల పోరులో చివరి పర్వమైన కౌంటింగ్ క్రతువు పటిష్ట బందోబస్తు నడుమ జరగనుంది. ఇందుకోసం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. విధులు నిర్వర్తించనున్న అధికారులు, సిబ్బంది ఉదయం 5 గంటలకే లెక్కింపు కేంద్రాలకు చేరుకుంటారు. జిల్లా ఎన్నికల అధికారులు ఓట్ల లెక్కింపుపై వీరికి దిశానిర్దేశం చేస్తారు. అనంతరం అభ్యర్థుల సమక్షంలో ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నానికి ఈ ప్రక్రియ పూర్తవుతుంది. తొలుత సిర్పూర్, తర్వాత ఆసిఫాబాద్ ఫలితం వెల్లడికానుంది.

పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు మొదలు

కౌంటింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) వద్ద ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక టేబుళ్లపై తొలుత పోస్టల్ బ్యాలెట్లు.. తర్వాత సర్వీస్ ఓట్లు, ఇంటి వద్ద వేసిన ఓట్లు లెక్కిస్తారు. ఉదయం 8 గంటలకు మొదలైన ఈ ప్రక్రియ అరగంటలో ముగుస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం ఆర్వో సమక్షంలో జరుగుతుంది. నిర్ణీత వ్యవధిలో లెక్కింపు పూర్తికాకపోయినా ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించవచ్చు. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయితే గాని ఈవీఎంల రౌండ్ల ఫలితాలు అధికారికంగా ప్రకటించడానికి వీల్లేదు.

రౌండ్ల వారీగా లెక్కింపు

జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించి 599 పోలింగ్ కేంద్రాల నుంచి తరలించి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రానికి ఉదయం తరలిస్తారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు లెక్కిస్తారు. అనంతరం ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను ఉదయం 8.30 గంటలకు లెక్కించడం ప్రారంభిస్తారు. ఇందుకు ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు అదనంగా మరో మూడు టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల క్రమసంఖ్య ఆధారంగా ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 22రౌండ్లు, సిర్పూర్‌కు 21 రౌండ్ల చొప్పున ఓట్లు లెక్కిస్తారు. క్రమసంఖ్య ఆధారంగానే ఒక్కో టేబుల్‌కు ఒక్కో కంట్రోల్ యూనిట్ కేటాయిస్తారు. ఇలా టేబుళ్లపై ఉన్న కంట్రోల్ యూనిట్లలోని ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక దానిని ఒక రౌండ్‌గా భావించి ఫలితం వెల్లడిస్తారు. ఈ ప్రక్రియ ముగియడానికి 20 నుంచి 30 నిమిషాలు పడుతుంది. ఓట్లు లెక్కించడం పూర్తయ్యే దాకా రౌండ్ల వారీగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. కౌంటింగ్ అధికారులు, అభ్యర్థుల తరఫున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో ఈ తంతు జరుగుతుంది. దీనిని అదనపు రిటర్నింగ్ అధికారి పర్యవేక్షిస్తుంటారు.

విధుల్లో 114 మంది సిబ్బంది

ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 38 మంది సూపర్‌వైజర్లు, 38 మంది సహాయ సూపర్‌వైజర్లు, 38 మంది మైక్రో అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించింది. వీరితో పాటు టేబుల్‌పైకి ఈవీఎంలను తీసుకురావడానికి, బ్యాలెట్ ఓట్లు లెక్కించడానికి అదనపు సిబ్బందిని నియమించారు. రిటర్నింగ్ అధికారి, అదనపు రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. ఓట్లు లెక్కించడానికి ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున అధికారులుంటారు. ఇందులో ఓ సూపర్‌వైజర్, ఓ మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఒకరు ఉంటారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను టేబుల్‌పైకి తీసుకురావడానికి ఒక క్యారీమెన్ సేవలందిస్తారు.

చివరలో వీవీప్యాట్ల చీటీలు..

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక ఈవీఎం, వీవీప్యాట్ల లెక్కలను సరిపోల్చేందుకు నియోజకవర్గంలోని ఏదేని ఐదు పోలింగ్ కేంద్రాల వీవీప్యాట్ల చీటీలను చివర్లో లెక్కిస్తారు. ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా వీవీప్యాట్లను ఎంపిక చేస్తారు. అభ్యర్థుల గుర్తుల వారీగా పెట్టెలను ఏర్పాటు చేసి వారికి వచ్చిన ఓట్లను వాటిలో వేసి లెక్కిస్తారు. ఒకవేళ ఈవీఎం కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ స్లిప్పుల లెక్కలకు తేడా వస్తే ఒకటికి రెండుసార్లు మళ్లీ వాటిని లెక్కిస్తారు. అయినా కూడా లెక్కల్లో తేడా లుంటే వీవీప్యాట్ స్లిప్పులనే పరిగణనలోకి తీసుకుని ఫలితాలు వెల్లడిస్తారు.

ధ్రువీకరణ పత్రం అందించనున్న ఆర్వో

ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక నియోజకవర్గంలో గెలుపొందిన పార్టీ, అభ్యర్థిని కౌంటింగ్ సూపర్‌వైజర్ నిర్ధారిస్తారు. అనంతరం సంబంధిత రిటర్నింగ్ అధికారి సదరు అభ్యర్థికి గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఇక్కడితో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. అయితే కాంగ్రెస్ మాత్రం తమ అభ్యర్థుల గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని కౌంటింగ్ ప్రక్రియలో ఉన్న చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లకు ఇవ్వాలని ఈసీని కోరింది.

మొదట సిర్పూర్ ఫలితం..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్ కేంద్రాలున్న నియోజకవర్గం సిర్పూర్. ఇక్కడ 294 కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు 21 రౌండ్లలో పూర్తవుతుంది. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 22 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు ఉంటుంది. దీంతో మొదట సిర్పూర్ ఫలితం వెల్లడికానుంది.

కట్టుదిట్టమైన భద్రత

ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రశాంత వాతావణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు పోలీసు ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందుకు 400 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు నియమించారు.

సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట కలెక్టర్ కార్యాలయ ఏవో రఫత్ అలీ ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

ఆసిఫాబాద్‌అర్బన్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సాంఘిక సంక్షేమ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత చేపట్టినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాలను డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు అగ్గిపెట్టె, లైటర్, ఇంక్ బాటిల్స్, పేలుడు వస్తువులను లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకురావద్దని తెలిపారు. అందరూ తనిఖీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన గుర్తింపుకార్డులున్న వారినే కేంద్రంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు. ఫలితాలు వెలువడిన నుంచి 24గంటల వరకు ఎలాంటి సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలోని స్ట్రాంగ్‌రూం వద్ద కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం జరిగే కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి 19 మంది చొప్పున కౌంటింగ్ బృందాలు, 14 కౌంటింగ్ టేబుళ్లు, మూడు పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ చొప్పున ఉంటారని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ముందు జాగ్రత్తగా అగ్నిమాపక వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పకడ్బందీగా లెక్కింపు చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం నిర్వహించనున్న కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎన్నికల అదనపు అధికారులతో కలిసి కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లు, కౌంటర్లు, మీడియా, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు, ఇతర అన్ని ఏర్పాట్లను నిబంధనలకు లోబడి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ బోర్కడే పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసి, పూర్తి బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 19 చొప్పున కౌంటింగ్ బృందాలు, 14 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, 8.30 గంటలకు కంట్రోల్ యూనిట్ల లెక్కింపు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ర్యాండం ప్రకారం వీవీ ప్యాట్లలోని స్లిప్పుల లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

'లెక్కింపులో పొరపాట్లకు తావివ్వొద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌మహిపాల్, వరప్రసాద్‌రెడ్డి

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ మహిపాల్, సిర్పూర్ నియోజకవర్గ పరిశీలకుడు వరప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు దాసరి వేణు, దీపక్ తివారితో కలిసి కౌంటింగ్ నిర్వహణకు నియమించిన సూపర్‌వైజర్లు, సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కౌంటింగ్ నిర్వహణలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకుల పాత్ర ఎంతో కీలకమని, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు తరలించే సమయంలో నిబంధనలు పాటించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది సకాలంలో చేరుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌లో ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించగా, జడ్జి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ జీవితంలో తప్పు చేయడం సాధారణమని, కానీ.. తప్పు చేయడానికి గల కారణం, పరిస్థితి తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. క్షణికావేశంలో చేసిన చిన్న తప్పు జీవితంలో ఎన్నో కోల్పోవడానికి కారణమవుతుందని తెలిపారు. వ్యక్తి తనపై తాను నిగ్రహం సాధించాలంటే ప్రతిరోజూ మెడిటేషన్ చేయాలని సూచించారు. దీంతో చేస్తున్న పనిపై శ్రద్ధ పెరగడంతో పాటు, తప్పు చేసే అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నారు. జైలు జీవితం ఖైదీల్లో పరివర్తన తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో జైలు అధికారి ప్రేమ్‌కుమార్, డిప్యూటీ చీఫ్ వెంకటేశ్వర్లు, లీగల్ అసిస్టెంట్ అంజనీదేవి, జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఎవరి ధీమా వారిదే..

- ఫలితాలపై స్వతంత్రుల ప్రభావం!

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తామని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహించారు. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. కాగా, అధికార బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకత, ఆరు గ్యారంటీలు తమకు విజయం చేకూరుస్తాయని కాంగ్రెస్ భావిస్తోంది. పదేళ్లలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ భరోసాగా ఉంది. మరికొన్ని గంటల్లో ఫలితాలు వెలువడనున్నందున సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 81.43 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో 4,53,538 మంది ఓటర్లు ఉండగా, 3,9,325 మంది ఓటు వినియోగించుకున్నారు. వీరిలో 1,86,555 మంది పురుషులు, 1,82,761 మంది మహిళలున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,26,664 మంది, సిర్పూర్ నియోజకవర్గంలో 2,26,874 మంది ఓటర్లున్నారు.

స్వతంత్రుల ప్రభావం ఎంతో?

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 17మంది, సిర్పూర్‌లో 13మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆసిఫాబాద్ బరిలో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులుండగా, వీరిలో ఆరుగురు ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన వారు. లంబాడా సామాజిక వర్గానికి చెందిన నలుగురు కూడా బరిలో ఉన్నారు. వీరిలో ప్రధాన కాంగ్రెస్ అభ్యర్థిగా అజ్మీరా శ్యాం నాయక్, బీజేపీ అభ్యర్థిగా అజ్మీరా ఆత్మారాం నాయక్, బహుజన ముక్తి అభ్యర్థిగా భూక్యా పల్లవి, మరో స్వతంత్ర అభ్యర్థి బరిలో ఉన్నారు. ఆయా సామాజిక వర్గాల ఓట్లు చీలితే గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్రం సక్కు స్వల్ప మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మిపై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ప్రభావం చూపనున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న కొట్నాక విజయ్ నియోజకవర్గంలో సుమారు 15 వేలకు పైగా ఓట్లు సాధిస్తానన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ మధ్యే త్రిముఖ పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. ఫలితాలపై అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ, అసెంబ్లీ ఎన్నికలు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారాయి. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నందున అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



శతశాతం కోసం..

- పకడ్బందీగా 'పది' ప్రత్యేక తరగతులు



కెరమెరి: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రారంభించిన 'లక్ష్య' కార్యక్రమం అవాంతరాల మధ్య కొనసాగుతోంది. గత నెలలో ప్రారంభమైన కార్యక్రమం ఎన్నికల నేపథ్యంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ఆదివారం ఓట్ల లెక్కింపుతో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియనుండగా, సోమవారం నుంచి యథావిధిగా ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రత్యేక తరగతులు విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెంచేందుకు దోహదపడుతాయి. ఇందులో భాగంగా నెల రోజులుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. జిల్లాలో 59 ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం ప్రారంభమైంది.

గతేడాది 79.99 శాతం ఉత్తీర్ణత

జిల్లా వ్యాప్తంగా 59 ప్రభుత్వ, 30 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 7,101 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 59 ప్రభుత్వ పాఠశాలల్లో 5,500 మంది విద్యార్థులున్నారు. వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏటా పదోతరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లా వెనుకబాటుకు గురవుతోంది. జిల్లాలో 2022-23 విద్యాసంవత్సరంలో 79.99శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇది రాష్ట్రస్థాయిలో 32వ స్థానం కావడం గమనార్హం. దీంతో ఈసారి ఎలాగైనా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా టాప్ టెన్‌లో ఉండాలన్న లక్ష్యంతో జిల్లా విద్యాధికారులు చర్యలు చేపట్టారు.

రోజూ గంటపాటు..

నిత్యం ఉదయం 8.30నుంచి 9.30గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం సాధ్యం కాకుంటే డీఈవో అనుమతితో సాయంత్రం నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతిరోజూ ఒకటి లేదా రెండు సామర్థ్యాలకు సంబంధించిన ప్రశ్నలు ఇచ్చి 30 నిమిషాల్లో స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మిగతా 30 నిమిషాల్లో విద్యార్థులు ఏ సామర్థ్యాల్లో వెనుకబడ్డారో చర్చించుకుంటున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

ఎన్నికల కారణంగా ఆటంకం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఆటంకమేర్పడింది. గత నెలలో అధికారులు, ఉపాధ్యాయులు ఎన్నికల శిక్షణలో ఉన్నారు. సెలవులు కూడా అధికంగా ఉండడంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయింది. 30న ఓట్ల లెక్కింపు ముగియనుండగా ఇక పదో తరగతి విద్యార్థులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ కారణంగా సుమారు 20రోజుల పాటు పూర్తి స్థాయిలో పాఠ్యాంశాల బోధన జరగలేదు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, ఉపాధ్యాయులు శిక్షణ, పోలింగ్ అధికారులుగా నియమితులు కావడంతో అనుకున్న సమయంలో సిలబస్ పూర్తి కాలేదు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో 80 శాతం సిలబస్ పూర్తికాగా.. వచ్చే నెలలో 100 శాతం పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు.

మరింత పకడ్బందీగా..



మరింత పకడ్బందీగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. ఈ నెలలో సిలబస్ పూర్తియ్యేలా చూస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 'లక్ష్య'లో భాగంగా గత నెల నుంచి పదో తరగతి విద్యార్థులకు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎన్నికల ప్రకియ ఆదవారం ముగియనుండగా సోమవారం నుంచి పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– పీ అశోక్, డీఈవో

క్లుప్తంగా

కారు, బైక్ ఢీ..ఒకరికి తీవ్ర గాయాలు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో శనివారం కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో దండేపల్లికి చెందిన పాలకుర్తి లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వస్తున్న లక్ష్మణ్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

ప్రచారం డబ్బులడిగిన మహిళపై దాడి


గాయపడిన ఈశ్వరమ్మ

మందమర్రిరూరల్ (చెన్నూర్): ఎన్నికల ప్రచారంలో తిప్పుకుని డబ్బులడిగితే దాడి చేసిన సంఘటన మందమర్రిలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన వృద్ధ దంపతులు తాళ్ల ఈశ్వరమ్మ, బాపు ఈ నెల 26, 27 తేదీల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారానికి పిలిస్తే వెళ్లారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.300ల చొప్పున రెండు రోజులకు కలిపి ఇద్దరికి రూ.1200లు రావాల్సి ఉండగా ఈశ్వరమ్మ నాయకులు కర్నాకర్ ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో అతని భార్య దాడికి పాల్పడడంతో కుడి చేతికి గాయమైంది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు పేర్కొంది. ఇదిలా ఉంటే మందమర్రిలో అంతా ఇదే పరిస్థితి నెలకొందని, ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు సరిగా పంపిణీ చేయలేదని, నాయకుల ఇంటిచుట్టూ తిరిగితే బెదిరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై చంద్రకుమార్‌ను వివరణ కోరగా దీనిపై కొంత మంది పిటిషన్ ఇచ్చారని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం


మృతదేహాలను పరిశీలిస్తున్న శ్యాంనాయక్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బెస్తవాడలో శుక్రవారం రాత్రి హత్యకు గురైన బామ్నె శ్రీను, గుబిడె శ్రావణ్ మృతదేహాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. శనివారం వైద్యులు రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రతీకార హత్యలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలో రెండు హత్యలు జరగడం కలకలం రేపింది.

విరబూసిన బ్రహ్మకమలం

దండేపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న లచ్చుపటేల్ ఇంటి ఆవరణలో మూడు నెలల క్రితం బ్రహ్మకమలం మొక్క నాటాడు. మొక్కకు శనివారం మూడు పువ్వులు విరబూశాయి. బ్రహ్మకమలం పుష్పాలు ఏడాదిలో రెండు సార్లు శ్రావణ మాసం, కార్తీక మాసంలో మాత్రమే వికసిస్తాయి. ప్రస్తుతం కార్తీక మాసం ముగిసే సమయంలో పూలు విరబూశాయి.


విరబూసిన బ్రహ్మ కమలం

గో సేవ.. సేంద్రియ తోవ

- ఒక్క ఆవుతో గోశాల ప్రారంభం
- ప్రస్తుతం 26కు చేరుకున్న గోవులు
- ఆవు పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువు తయారీ
- ఆదర్శం.. శివలింగాపూర్ గోశాల


సతీశ్ ఇంటి వద్ద ఉన్న గోశాలలో ఆవులు

చెన్నూర్‌రూరల్: వ్యవసాయరంగంలో ఎద్దులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంటిముందు చూసినా ఆవులు, గేదెలు, ఎద్దులు కనిపించేది. స్వచ్ఛమైన పాలకోసం పల్లెల్లో ఇంటింటా ఆవులు, గేదెలను పెంచేవారు. కానీ రాను రాను వాటి పోషణ భారమైంది. ఆవులను పోషించడం చాలా కష్టతరంగా మారడంతో పల్లెల్లో పశు సంపద తగ్గుతూ వస్తోంది. ఇక పట్టణాల్లో ఆవులకు సరైన మేత దొరకక ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు తింటున్నాయి. కానీ మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన గోనె సతీశ్ అనే రైతు మాత్రం గోమాతపై ఉన్న మక్కువతో తన ఇంటి వద్ద ప్రత్యేకంగా గోశాలను ఏర్పాటు చేశాడు. 2016లో ఒక్క ఆవుతో గోశాలను ప్రారంభించాడు. మధ్యలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా పట్టు వీడకుండా నెమ్మది, నెమ్మదిగా ఆవుల సంఖ్యను పెంచుతూ వచ్చాడు. ప్రస్తుతం గోశాలలో ఆవుల సంఖ్య 26కు చేరుకుంది. గోవుల కోసం ప్రత్యేకంగా ఇంటివద్ద తనకున్న ఎకరా స్థలంలో 10 గుంటల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేశాడు. 20 గుంటల్లో కూరగాయలు, మరో పది గుంటల్లో ఆవుల మేత కోసం పచ్చిగడ్డి పెంచుతున్నాడు. ఆవులకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పచ్చిగడ్డి, తౌడు, ఇతర దాణా అందిస్తున్నాడు. సతీశ్ సోదరుడు భాస్కర్, కుటుంబ సభ్యులు అతనికి గోశాలలో చేదోడు, వాదోడుగా ఉంటున్నారు.

గృహ ప్రవేశాలకు ఉచితం

కొత్తగా నిర్మించుకున్న ఇళ్లల్లో మొదటిసారి తప్పనిసరిగా ఆవు, లేగదూడలతో గృహ ప్రవేశం చేయించడం ఆనవాయితీ. ఆవు, లేగదూడలను నూతన గృహ ప్రవేశానికి తీసుకు వచ్చేందుకు ఎంతో కొంత డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ సతీశ్ మాత్రం నూతన గృహ ప్రవేశాలకు ఆవు, లేగెదూడలను ఉచితంగా పంపిస్తున్నాడు. ఇందుకు డబ్బులు ఇవ్వకుండా వాటికి దాణా పెడితే చాలంటున్నాడు.

సేంద్రియ ఎరువుల తయారీ

ఆవు పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువుతో కూరగాయలను సాగు చేస్తున్నాడు. ద్రవ, ఘన జీవామృతం ఎరువులను తయారు చేసి కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నాడు. త్వరలోనే మరిన్ని ఆవులను తీసుకు వస్తానని, ఎవరైనా ఆవులు పంపిస్తే కూడా వాటిని కూడా గోశాలలో ఉంచి పెంచడం జరుగుతుందని సతీశ్ చెబుతున్నాడు. అందుకు తనను 9000402074 నంబరులో సంప్రదించాలని కోరుతున్నాడు.

గోమాత అంటే ఎంతో ఇష్టం



మాది వ్యవసాయ కుటుంబం. నాకు గోమాత అంటే ఎంతో ఇష్టం. అందుకే గోశాల పెట్టాలని కోరిక. మాకు ఇంటి వద్ద ఎకరా స్థలం ఉంది. అందులోని పది గుంటల స్థలంలో షెడ్డు నిర్మించి ఒక్క ఆవుతో గోశాల ప్రారంభించా. ప్రస్తుతం 26 వరకు ఆవులు ఉన్నాయి. – గోనె సతీశ్, గోశాల నిర్వాహకుడు, శివలింగాపూర్

హ్యాండ్‌బాల్ జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

భీమారం(చెన్నూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం అండర్–14 బాలబాలికల, అండర్–17 బాలుర హ్యాండ్‌బాల్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఇందులో ఎంపికైన వారు త్వరలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాల్గొంటారని జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి పరిమళ తెలిపారు. ఈ పోటీలలో మొత్తం 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల కన్వీనర్, పాఠశాల హెచ్ఎం విక్రమ్‌కుమార్, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ క్రీడల అధికారి బండ మీనారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు విఠల్, సదానందం, సాగర్, శ్రీనివాస్, రవి, రాకేష్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మధున పోచమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కోటపల్లి(చెన్నూర్) మండలంలోని జనగామలో మూడు రోజులుగా కన్నుల పండువగా సాగిన మధున పోచమ్మ జాతర శనివారం ముగిసింది. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల, బోనాలతో భక్తులు అమ్మవారి చెంతకు చేరుకున్నారు. కొత్తకుండలో వండిన పాయసం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి సల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. మొదటిరోజు గోదావరి పుణ్యస్నానంతో జాతర ప్రారంభం కాగా రెండో రోజు రథయాత్ర, మూడో రోజు బోనాల సమర్పణతో జాతర ముగిసింది. జాతరకు జనగామ, వెంచపల్లి, సుపాక, నందరాపల్లి, ఆలుగామ, ఎదులబందం, బొప్పారం గ్రామాలతో పాటు చెన్నూర్ పొరుగునే ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ఘటన సమయంలో వాహనంలో 23 మంది కూలీలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని గుండాల గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం గుండాల గ్రామానికి చెందిన 23 మంది కూలీలు ట్రాక్టర్‌లో రోంపెల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో 8 మందికి త్రీవంగా మరి కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మస్టర్‌ను ప్లేడేగా పరిగణించాలి


మాట్లాడుతున్న పత్తెం రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి కార్మికుల మస్టర్‌ను ప్లేడేలుగా పరిగణించాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూడకపోవడం బాధాకరమన్నారు. సింగరేణిలో సెలవు దినం విధులు నిర్వహించిన వారికి రెండు మస్టర్లు చెల్లించే యాజమాన్యం ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి క్లర్కులు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది, ఇతర కార్మికులకు ప్లేడేలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే ఇనూష్, ఎస్అండ్‌పీసీ పిట్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, హాస్పిటల్ ఇన్‌చార్జి ఆర్. శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ తల్లి మృతి
- కూతురి పరిస్థితి విషమం


నిర్మల మృతదేహం

తాండూర్(బెల్లంపల్లి): వ్యక్తిగత కారణాలతో తల్లీకూతుళ్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన గొడిసెల నిర్మల (40) భర్త గతంలోనే మృతి చెందగా కూతురు రచన (19)తో కలిసి నివాసం ఉంటోంది. శుక్రవారం రాత్రి వ్యక్తిగత కారణాలతో ఇద్దరూ గొడవ పడ్డారు. తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన రచన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన నిర్మల తానూ గడ్డిమందు తాగింది. ఇరువురిని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి నిర్మల శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. రచన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై నిర్మలకు సోదరుడి వరుసైన ఇడిగిరాల కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- నేడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- ఫలితాలపై రూ.కోట్లలో బెట్టింగ్
- పందెం కాస్తున్న వ్యాపారులు, నేతలు, యువకులు

కాయ్ రాజా.. కాయ్

- దహెగాం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు, బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుపై ఆయా పార్టీల నాయకులు, వ్యాపారులు, యువకులు రూ.లక్షల్లో బెట్టింగ్ కడుతున్నారు.
- ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుపై పార్టీ కార్యకర్తలు, వ్యాపారులు, యువకులు జోరుగా బెట్టింగ్ కడుతున్నారు.
- బెజ్జూర్ మండలంలోని కార్యకర్తలు బెట్టింగ్‌లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. తమ అభిమాన నాయకుడు ఎన్నికల్లో గెలుస్తాడని వ్యవసాయ భూములను సైతం బెట్టింగ్ పెడుతున్నారు.
- కౌటాల మండల కేంద్రానికి చెందిన ఆయా ప్రధాన పార్టీల నాయకులు నగదుతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు బెట్టింగ్ కడుతున్నారు.



కౌటాల(సిర్పూర్): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్‌ల జోరు ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నేడు ఓట్ల లెక్కింపు ఉండడంతో అభ్యర్థుల గెలుపోటముల బెట్టింగ్ జోరు సాగుతోంది. ప్రధాన కూడళ్లలో నలుగురు కలిసి కూర్చుంటే చాలు అభ్యర్థుల విజయావకాశాలపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. మరికొందరు ఒకడుగు ముందుకేసి అభ్యర్థుల గెలుపోటములపై పందెం కడుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఫలితాలు నేడే

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల అభ్యర్థులపై బెట్టింగ్ జోరుగా సాగుతోంది. అభ్యర్థుల గత చరిత్ర , ప్రస్తుత బలాబలాలు, బలహీనతలపై ప్రజలు, రాజకీయ విశ్లేషకుల మధ్య ప్రధానంగా చర్చ జరుగుతోంది. క్రికెట్ బెట్టింగ్ మాదిరి చైన్ పద్ధతిలో కాకుండా వ్యక్తిగతంగా డబ్బుల పంపకం నిర్వహిస్తున్నారు. నేడు ఓట్ల లెక్కింపు ఉండడంతో తమ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ఒకరు, కాదు తమ నాయకుడే గెలుస్తాడని ఇంకొకరు బెట్టింగ్‌లు కడుతున్నారు.

రూ.కోట్లలోనే బెట్టింగ్..!

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు, మట్కా, జూదం విచ్చలవిడిగా సాగిన సందర్భాలు గతంలో అనేకం ఉన్నాయి. ఈజీ మనీకి అలవాటు పడ్డ బడాబాబుల బిడ్డలు ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. తమ విశ్లేషణ ప్రకారం ఫలానా అభ్యర్థి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందుతాడు చూడండి.. అంటూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. రూ.5 వేల నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు పందెం కాస్తున్నారు. ఈ సారి ఎన్నికలు హోరాహోరీగా జరిగాయని, ఏ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ రాదని కార్యకర్తలు బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఆయా పార్టీల అభిమానులు తమ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ బెట్టింగ్‌లు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యాపారులు సైతం ఈ బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో రూ.కోట్లలోనే బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములతో పాటు రాష్ట్రంలో ఫలానా పార్టీ అధికారంలోకి వస్తుంది. ఫలానా వ్యక్తి ముఖ్యమంత్రిగా బాధ్యతలు సైతం స్వీకరిస్తాడంటూ.. కావలిస్తే బెట్ కట్టండి అంటూ ఒకరినొకరు రెచ్చగొడుతున్నారు.

తనిఖీ చేసి.. ఫైన్ వేసి


ఫైన్ రాస్తున్న ఆర్టీసీ అధికారులు

భీమిని(బెల్లంపల్లి): 'టికెట్ లేని ప్రయాణం నేరం....అందుకు రూ.500 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది' అనే నినాదం ఆర్టీసీ బస్సుల్లో రాసి ఉంటుంది. దీనికి తగ్గట్టుగా శనివారం దహెగాం నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును జన్కాపూర్ వద్ద విజిలెన్స్ అధికారులు ఆపి తనిఖీ చేశారు. ఓ మహిళ టికెట్ తీసుకోకపోవడంతో రూ.30 టికెట్ చార్జీతో పాటు రూ.500 జరిమానా విధించారు.

మావోల అలజడి

- ఇందారంలో ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్
- హైఅలర్ట్ ప్రకటించిన పోలీస్ యంత్రాంగం
- ప్రారంభమైన మావోయిస్టుల వారోత్సవాలు

మంచిర్యాలక్రైం: జిల్లాలో మావోయిస్టుల అలజడి మొదలైంది. మావోయిస్టుల ఉనికి తగ్గిందని పోలీసులు చేస్తున్న ప్రచారాన్ని మావోలు తిప్పికొడుతున్నారు. ఈ నెల 2నుంచి మావోయిస్టుల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వాటిని తిప్పికొట్టే ందుకు పోలీసులు అడవుల్లో జల్లెడ పడుతున్నారు. ఈ నేపథ్యంలో జైపూర్ మండలం ఇందారంలో ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడంతో జిల్లాలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

వారోత్సవాల నేపథ్యం

అప్పటి సీపీఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నల్లా ఆదిరెడ్డి, ఏపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, ఉత్తర తెలంగాణ స్పెషల్‌జోన్ కమిటీ కార్యదర్శి శీలం నరేష్ 1999 డిసెంబర్ 2న కొయ్యూర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. వారి వర్ధంతిని 2000 డిసెంబర్ 2న పీపుల్స్ గెరిల్లా ఆర్మీ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఏటా మావోయిస్టులవారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

'పొంగులేటి'కి సీఎం పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న సంతోష్

మందమర్రిరూరల్(చెన్నూర్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికే ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక సంతోష్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే ఇతర పార్టీల నుంచి ముఖ్యులు వచ్చి చేరారని, చాలాచోట్ల రాహుల్‌గాంధీ సభలు విజయవంతం అయ్యాయన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు శేఖర్, కుమార్, రాజేశ్, రాజు, స్వామి, వేణు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావంతో పలు రైళ్ల రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: చెన్నై నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లను రద్దు చేస్తూ ఉన్నతాధికారులు శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు కాగజ్‌నగర్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ తెలిపారు. కోచువెల్లి నుంచి గోరఖ్‌పూర్ అప్, డౌన్ (కోచువెల్లి ఎక్స్‌ప్రెస్) ఈ నెల 4, 7 తేదీల్లో, చెన్నై నుంచి న్యూ ఢిల్లీ అప్, డౌన్ (జీటీ ఎక్స్‌ప్రెస్)ను ఈ నెల 4 నుంచి 6 వరకు, 8న, చెన్నై నుంచి అహ్మదాబాద్ అప్, డౌన్ (నవజీవన్ ఎక్స్‌ప్రెస్)ను ఈ నెల 3 నుంచి 6వరకు, చెన్నై నుంచి ఛప్రా అప్, డౌన్ రైలును ఈ నెల 5, 7 తేదీల్లో, చెన్నై నుండి బిలాస్‌పూర్ అప్, డౌన్ రైలును 3, 5 తేదీల్లో, మైసూర్ నుంచి జైపూర్ అప్, డౌన్ రైలును ఈ నెల 4, 6 తేదీల్లో, పాండిచ్చేరి నుంచి న్యూఢిల్లీ అప్, డౌన్ రైలును ఈ నెల 4, 7 తేదీల్లో, ఎర్నాకులం నుంచి బిలాస్‌పూర్ వరకు అప్, డౌన్ రైలును ఈ నెల 4, 7 తేదీల్లో, రామేశ్వరం నుండి వారాణాసి అప్, డౌన్ రైలును ఈ నెల 4, 8 తేదీల్లో రద్దు చేశారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో మిఛావుంగ్ తుపాన్ ప్రభావంతో ఈ రైళ్లను రద్దు చేసినట్లు ఆయన వివరించారు. కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని, రైళ్ల రాకపోకలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9701371147 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకుల దాడి


చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్త

చెన్నూర్: చెన్నూర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారు. బాధితుడు బొంతల సందీప్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బొంతల సందీప్ ఇంటి ముందు రెండు రోజుల క్రితం డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా విద్యుత్ తీగలు తొలగించడంతో ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం సాయంత్రం 16వ వార్డు కౌన్సిలర్ తుమ్మ రమేశ్ ఇంటికి వెళ్లి విద్యుత్ తీగలు అమర్చేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. దీంతో కౌన్సిలర్ రమేశ్ కర్రతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. 108లో ఆస్పత్రికి తరలించారు. పెద్దగూడెం కాలనీకి చెందిన వడ్లకొండ వరప్రసాద్‌పై అదే కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తగరం సంపత్ దాడి చేశాడు. ఈ దాడిలో వరప్రసాద్ తల్లి రాజక్కకు గాయాలయ్యాయి. ఇరువురిని అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, రవికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం షాపు వద్దని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకురాళ్లు

శ్రీరాంపూర్: పట్టణంలోని ఆర్కే 6 కొత్తరోడ్‌లో మద్యం షాపు పెట్టవద్దని బీఎస్పీ మహిళా విభాగం నాయకురాళ్లు నిరసన వ్యక్తం చేశారు. షాపు తెరిచేందుకు యజమాని ఏర్పాట్లు చేస్తుండగా బీఎస్పీ కన్వీనర్ భవాని, ఇతర మహిళలు వచ్చి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ 363 వల్ల ముందున్న సర్వీస్‌రోడ్డు చిన్నగా మారిందని, ఇక్కడ వైన్స్‌షాప్ ఏర్పాటు చేస్తే వాహనాల పార్కింగ్ సమస్య ఏర్పడుతుందన్నారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్ ఇబ్బంది రాకుండా యజమానితో మాట్లాడుతామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

9న లక్ష దీపోత్సవం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 9న లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ గోదారంగనాథ కోలాట బృందం నిర్వాహకురాలు మంజుభాషిణి తెలిపారు. శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనంతో శ్రీ త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో లోక కల్యాణార్థం శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీనివాస కల్యాణం, లక్ష దీపోత్సవం, ఊంజల సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.